


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నా గురువు జన్మస్థలం.. పిఠాపురం

2014లో జనసేన తరఫున పిఠాపురం నుంచి పోటీ చేయమని చాలామంది అడిగారు. కానీ అప్పుడు కుదర్లేదు. అయితే ఇప్పుడు పిఠాపురం నుంచి పోటీచేయాలని నిర్ణయించుకున్నా. నా గురువైన దత్తాత్రేయుల అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు జన్మస్థలమది. అది.. శక్తి పీఠం కూడా.. అక్కడి నుంచే పోటీ చేస్తా. ఎంపీగా పోటీ చేయాలా లేదా అనేది ఇంకా నిర్ణయించుకోలేదు.

- కొణిదెల పవన్‌కల్యాణ్, జనసేన అధినేత

రాజమండ్రి రూరల్

వైసీపీని ఓడించండి..



ప్రజలందరూ తాయిలాలు తీసుకోండి.. కానీ మన భవిష్యత్తు కోసం ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని ఓడించండి. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారథ్యంలో ముందుకుసాగుదాం. చదువుకున్న మేధావులంతా తప్పని సరిగా ఓటు వేయాలి. ఓటు కొనేవారికి విలువ తెలపాలి.

- బుచ్చయ్యచౌదరి, టీడీపీ

రాజోలు

అభివృద్ధికి పాటుపడతా..



సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేసిన అనుభవంతో రాజోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తా. నియోజకవర్గ ప్రజల సహకారంతో జనసేన అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తా. కూటమి ప్రభంజనం సృష్టిస్తుంది.

- దేవ వరప్రసాద్, జనసేన

ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమానికి కృషి



నా భర్త రాజా ఆశయ సాధనకు, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తా. నాకు టీడీపీ తరఫున టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

- వరుపుల సత్యప్రభ, టీడీపీ

కొవ్వూరు

గెలిచి బాబుకు గిఫ్ట్ ఇస్తా..



పాలకుడిగా కాదు.. సేవకుడిగా కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తా. టీడీపీ అధినేత చంద్రబాబు నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నియోజకవర్గ నాయకులందరినీ కలుపుకుని మంచి మెజార్టీతో గెలిచి కొవ్వూరును చంద్రబాబుకు గిఫ్టుగా ఇస్తా.

- ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ

గోపాలపురం

క్రమశిక్షణకు గుర్తింపు



టీడీపీలో క్రమశిక్షణతో పనిచేసే ప్రతి ఒక్కరి నిబద్ధతకు పట్టం కడతారు. కష్టకాలంలో పార్టీ కోసం కష్టించి పనిచేసే యువతను అధినేత చంద్రబాబు గుర్తిస్తారు. టిక్కెట్టు కేటాయించడం పట్ల అధినేత చంద్రబాబు, లోకేశ్‌లకు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

- ఎం. వెంకట్రాజు, టీడీపీ

రామచంద్రపురం

మంచి మెజార్టీతో గెలుస్తా



టీడీపీ జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తాను. అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేసుకుని ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పనిచేసి మంచి మెజార్టీతో గెలుస్తాను. వైసీపీపై ఉన్న వ్యతిరేకతను ఓటర్లలోకి తీసుకువెళ్లి వారి సహకారంతో గెలవడం తథ్యం.

- వాసంశెట్టి సుభాష్, టీడీపీ

రంపచోడవరం

దరఖాస్తు పెట్టుకున్నా..



రంపచోడవరం తెలుగుదేశం అభ్యర్థిగా ఎంపికవడం ఊహించని పెద్ద బాధ్యతగా భావిస్తున్నా. టీడీపీ తరఫున అవకాశం ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్నా. టీడీపీ అధినేత చంద్రబాబు యువతకు అవకాశం ఇవ్వాలన్న లక్ష్యం మేరకే సీటు ఇచ్చారు.

- శిరీషాదేవి, టీడీపీ

ఉమ్మడి తూర్పున స్థానాలు 22
పశ్చిమ స్థానాలతో సహా..

ఇప్పటివరకూ ప్రకటన 20

టీడీపీ	15
జనసేన	5
మిగిలినవి	2

జిల్లాల విభజనలో భాగంగా పశ్చిమ నుంచి మూడు నియోజకవర్గాలు ఉమ్మడి తూర్పులో కలిశాయి.. రెండు టీడీపీ.. ఒక స్థానంలో జనసేన పోటీ చేస్తున్నాయి.



సమరమే..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డంతో టీడీపీ, జనసేన పార్టీలు అభ్యర్థుల లెక్కలు తేల్చేశాయి. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్థానాల గుట్టు విప్పేశాయి. తొలివిడత జాబితాలో పెద్దగా తలనొప్పులు లేని సీట్లను ప్రకటించిన ఇరుపార్టీలు మలివిడత ప్రకటించాల్సిన జాబితాపై భారీ కసరత్తు జరిపాయి. సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల సామర్థ్యాలు, ప్రత్యర్థి పార్టీ బలాబలాలపై కొన్నిరోజులుగా విస్తృత కసరత్తు జరిపి ఎట్టకేలకు గురువారం గెలుపు గుర్రాలను ప్రకటించాయి. మొత్తం ఆరు స్థానాల్లో అభ్యర్థులపై స్పష్టత రాగా, ఇందులో టీడీపీ నాలుగు, జనసేన ఇద్దరు అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలకు రెండో జాబితాతో కలిపి మొత్తం 17 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను రెండు పార్టీలు వెల్లడించాయి. ఇంకా కాకినాడ సిటీ, అమలాపురం సీట్లకు సంబంధించి బరిలో నిలబడేదెవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. కాగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేసే స్థానంపై ఇంతకాలం కొనసాగిన గందరగోళానికి తెరపడింది. దీనికి స్వయంగా పవన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. పిఠాపురం నుంచి బరిలోకి దిగుతున్నట్టు ఆయనే వెల్లడించారు. అటు రాజమహేంద్రవరం రూరల్ సీటుపైనా స్పష్టత వచ్చేసింది. ప్రత్యామ్నాయంగా జనసేనకు నిడదవోలు స్థానం కేటాయించి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్లకే టీడీపీ సీటు ఖాయం చేసింది. కాగా గురువారం ప్రకటించిన ఆరు స్థానాల్లో నాలుగు స్థానాల్లో అభ్యర్థులు ఏకంగా తొలిసారి పోటీ చేస్తున్నవారే కావడం విశేషం. ఈ ఎంపికలోను ఇరుపార్టీలు సామాజిక సమతూకం పాటించాయి. కాగా పవన్ పిఠాపురం నుంచి బరిలోకి దిగుతుండడంతో టీడీపీ ఇన్‌చార్జి వర్మకు అన్యాయం జరిగిందంటూ తెలుగుదేశం శ్రేణులు ఆందోళనకు దిగాయి.

అన్నీ బేరీజు వేసి... ధీటైన ఎంపిక చేసి..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెజార్టీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన పావులు కదుపుతున్నాయి. అందులో భాగంగా అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘ కసరత్తు జరిపిన తర్వాతే గెలుపు గుర్రాలను ఖాయం చేస్తున్నాయి. తాజాగా గురువారం టీడీపీ రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో నాలుగు స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. రాజమహేంద్రవరం రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరును ఖాయం చేసింది. ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ, రామచంద్రపురం నుంచి వాసంశెట్టి సుభాష్, రంపచోడవరం నుంచి మిరియాల శిరీష పేర్లు ఖరారయ్యాయి. వాస్తవానికి గత నెల 24న టీడీపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన సమయంలో ఈ నాలుగు సీట్లను పెండింగ్‌లో ఉంచింది. వీటిలో కొన్ని సీట్లను జనసేన కోరుతుండడం, మరికొన్నిచోట్ల అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉండడంతో పార్టీ అధిష్ఠానం విస్తృత కసరత్తు జరిపింది. రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయమై ఇరుపార్టీల మధ్య పీటముడి కొనసాగడంతో తొలి విడత జాబితాలో అభ్యర్థి ప్రకటన వాయిదాపడింది.ఎట్టకేలకు ఈ సీటుపై ఇరుపార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. రాజమహేంద్రవరం రూరల్ సీటుకు బదులు దుర్గేష్‌కు నిడదవోలు ఇవ్వడానికి టీడీపీ ముందుకు రావడంతో బుచ్చయ్యకు లైన్‌క్లియర్ అయింది. ఈ నేపథ్యంలో గురువారం నాటి జాబితాలో గోరంట్ల పేరు ప్రకటించారు. అటు రామచంద్రపురం సీటు కోసం శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వాసంశెట్టి సుభాష్, కాదా వెంకటరమణ పోటీపడ్డారు. వైసీపీ నుంచి ఎంపీ బోస్ తనయుడు బరిలో ఉన్న నేపథ్యంలో ఆయన్ను సమర్థవంతంగా ఢీకొట్టే యువకుడిగా సుభాష్‌ను గుర్తించి ఆయనకు సీటు ఖాయం చేశారు. పైగా ఇక్కడ అభ్యర్థిని ప్రకటించడానికి ముందురోజు కూడా టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఇందులో సుభాష్ వైపు మొగ్గు రావడంతో పేరు ఖాయం చేసింది. ప్రత్తిపాడు సీటు వరుపుల సత్యప్రభకు ఖాయమైంది. తొలివిడత జాబితాలో ఈమె పేరు ఉంటుందని భావించినా పార్టీలో అంతర్గత సమస్యలను చక్కదిద్దాల్సి రావడంతో ప్రకటన వాయిదా వేశారు. అటు జనసేన కూడా ఈ సీటు కోరడంతో ప్రకటించలేదు. అయితే పిఠాపురం సీటు నుంచి పవన్ పోటీ ఖాయం అవడంతో, ప్రత్తిపాడు నుంచి కాపు సామాజికవర్గానికి చెందిన సత్యప్రభకు లైన్‌క్లియర్ అయింది. అటు రంపచోడవరం సీటు అనూహ్యంగా మిర్యాల శిరీషను వరించింది. రాజవొమ్మంగి మండలం గింజర్తికి చెందిన ఈమె గిరిజనతెగలో కోయ సామాజికవర్గానికి చెందినవారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సీటు ఆశించినా వైసీపీకి ధీటైన అభ్యర్థిగా శిరీష అని తేలడంతో సీటు ఈమెకే ఖరారైంది. తాజాగా టీడీపీ ప్రకటించిన నాలుగు సీట్లలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి మినహా మిగిలిన ముగ్గురు అభ్యర్థులు తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న నేతలే. ఇదిలా ఉంటే తాజా రెండో జాబితాతో కలిపి ఇప్పటివరకు మొత్తం 13 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను బరిలోకి దించినట్టయింది. ఇందులో ఎక్కడికక్కడ సామాజిక సమతూకం పాటించి అన్నివర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకుని గెలుపుగుర్రాలను ఎంపిక చేసిందనే అభిప్రాయం వినిపిస్తోంది.

- ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు స్థానాలు ప్రకటన
- రాజమహేంద్రవరం రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్లకే
- పిఠాపురం నుంచి బరిలోకి పవన్.. వీడిన సస్పెన్స్
- రిటైర్డ్ ఐఏఎస్ వరప్రసాద్‌కు రాజోలు సీటు
- ఇప్పటి వరకు 17 స్థానాల్లో అభ్యర్థుల వెల్లడి
- టీడీపీ నుంచి 13 మంది, జనసేన నుంచి నలుగురు
- కాకినాడ సిటీ, అమలాపురం అభ్యర్థులపై సస్పెన్స్
- పిఠాపురం, కొవ్వూరు సీట్లపై భగ్గుమన్న తమ్ముళ్లు

సస్పెన్స్‌కు తెర.. పవన్ రెడీ!

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీచేసే స్థానంపై కొంతకాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. పిఠాపురం సీటు నుంచి తాను పోటీ చేస్తున్నట్టు స్వయంగా పవన్ ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు అందరి దృష్టి ఈ నియోజకవర్గంపై పడింది. వాస్తవానికి ఈసారి పవన్ పిఠాపురం నుంచే బరిలోకి దిగుతారని బలంగా ప్రచారం జరిగింది. అదే సమయంలో గతంలో పోటీచేసిన గాజువాక, భీమవరం నుంచి కూడా పోటీ చేయవచ్చనే చర్చ జరిగింది. కానీ బుధవారం ఈ రెండు స్థానాల్లో అభ్యర్థులను వెల్లడించడంతో పవన్ పిఠాపురం నుంచి పోటీచేయడం ఖాయమని తేలిపోయింది. పవన్ కూడా గురువారం ఇదే విషయాన్ని ప్రకటించారు. దీంతో పవన్ పోటీ చేసే స్థానంపై సస్పెన్స్‌కు ముగింపు లభించింది. అటు పిఠాపురం నుంచే పవన్ బరిలోకి దిగుతారని ఆంధ్రజ్యోతి ముందే వెల్లడించింది. పవన్ ప్రకటన నేపథ్యంలో పిఠాపురం టీడీపీలో ముసలం రాజుకుంది. ప్రస్తుత ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మకు అన్యాయం జరిగిందంటూ టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. టీడీపీ గెలిచే స్థానం అయినప్పటికీ అధిష్ఠానం ఈ సీటును జనసేనకు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. వర్మకు టిక్కెట్టు లేకపోవడంతో పిఠాపురం టీడీపీ కార్యాలయం ఎదుట పార్టీ జెండాలను కార్యకర్తలు తగులబెట్టారు. అటు వర్మ కూడా మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం టీడీపీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమావేశానికి హాజరై పార్టీ కేడర్ అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. ఈనేపథ్యంలో వర్మ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతారనే చర్చ జరుగుతోంది. మరోపక్క పవన్ పిఠాపురం నుంచి పోటీ ఖాయమైన నేపథ్యంలో సినీ డైరెక్టర్ రాంగోపాల్‌వర్మ తాను కూడా పిఠాపురం నుంచి పోటీ చేస్తానని సోషల్ మీడియాలో ప్రకటించడం విశేషం. ఇదిలా ఉంటే రిజర్వుడు నియోజకవర్గమైన రాజోలు సీటు మాజీ ఐఏఎస్ అధికారి వరప్రసాద్‌కు ఖరారైంది. జనసేనలో కీలకమైన జనవాణి కార్యక్రమాన్ని వరప్రసాద్ కొన్నేళ్లుగా పర్యవేక్షిస్తున్నారు. మలికిపురం మండలం దిండికి చెందిన ఈయన స్థానికుడు కూడా కావడంతో టిక్కెట్టు ఇవ్వడానికి జనసేన మొగ్గు చూపింది. అయితే ఈయనకు సీటు కేటాయింపుపై అధికారిక ప్రకటన రావలసి ఉంది.

ఆ రెండూ ఎప్పుడో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలకు ఇప్పటి వరకు రెండు జాబితాల్లో కలిపి టీడీపీ, జనసేన 17 సీట్లలో అభ్యర్థులను ప్రకటించినట్టయింది. ఇంకా కాకినాడ సిటీ, అమలాపురం నియోజకవర్గాల్లో బరిలో ఎవరు ఉంటారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. కాకినాడ సిటీలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని ఢీకొట్టే సమర్థ నేతను ఎంపిక చేయడం కోసం కొన్నిరోజులుగా టీడీపీ అధిష్ఠానం ఎడతెగని కసరత్తు చేస్తోంది. పైగా ద్వారంపూడిని ఎలాగైనా ఓడించాలని టీడీపీ, జనసేన పార్టీలు పట్టుదలగా ఉన్నాయి. ఈయన ఎలా గెలుస్తాడో చూస్తానంటూ పవన్ సైతం ఇప్పటికే శపథం పట్టారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు టిక్కెట్టు రేసులో ఉన్నా మరింత మెరుగైన అభ్యర్థి కోసం వడపోత పోస్తున్నట్టు సమాచారం. అమలాపురం సీటుపైనా ఉత్కంఠ నెలకొంది. ఈ సీటు జనసేన కోరుతోంది. టీడీపీ నుంచి కూడా పోటీ ఉంది. అయితే రామచంద్రపురం సీటులో తాజాగా టీడీపీ తన అభ్యర్థిని నిలబెట్టడంతో జనసేనకు అమలాపురం సీటు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. త్వరలో ఈ రెండు స్థానాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా ఇప్పటి వరకు ఇరు పార్టీలు ప్రకటించిన మొత్తం 17 అసెంబ్లీ సీట్లలో ఎనిమిది మంది పూర్తిగా మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారే కావడం విశేషం. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో మూడు ఎంపీ స్థానాలపైనా త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తూర్పున మరో రెండు..

గోపాలపురం నుంచి మద్దిపాటి.. కొవ్వూరు ముప్పిడి..

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), మార్చి 14: కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలోకి పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా నుంచి కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాలు కలిసిన విషయం తెలిసిందే. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి పొత్తులో భాగంగా ఇప్పటికే నిడదవోలు అసెంబ్లీ నుంచి జనసేన అభ్యర్థిగా కందుల దుర్గేష్‌ను ప్రకటించారు. గురువారం ప్రకటించిన టీడీపీ జాబితాలో కొవ్వూరు నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావును అభ్యర్థిగా ఎంపిక చేశారు. ముప్పిడి 2014లో గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికకాగా, 2019లో ఓటమి పాలయ్యారు. గోపాలపురం వైసీపీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తలారి వెంకట్రావును ఇటీవల ఆ పార్టీ అధిష్ఠానం కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గతేడాది ఎన్నికల్లో తలపడిన ముప్పిడి, వెంకట్రావులు ఈసారి మళ్లీ కొవ్వూరు నుంచి తలపడుతున్నట్టు అయింది.ఇక తాజాగా టీడీపీ ప్రకటించిన జాబితాలో గోపాలపురం అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజును ప్రకటిస్తూ టీడీపీ అధిష్ఠానం క్లియరెన్స్ ఇచ్చింది. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థినిగా హోం మంత్రి తానేటి వనిత పోటీ చేస్తున్నారు. తొలి జాబితాలోనే గోపాలపురం సీటు ప్రకటించాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల రీత్యా నిలుపుదల చేశారు. నియోజకవర్గంలో అంతా సర్దుబాటు చేసి ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న మద్దిపాటి వెంకట్రాజునే అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో విభజిత తూర్పు యుద్ధానికి సిద్ధమైంది.

ఆ ఒక్కటే.. ఉత్కంఠ!

- కాకినాడ జిల్లాలో ఆరు స్థానాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ఖరారు
- కాకినాడ సిటీ స్థానంపై కొనసాగుతున్న సస్పెన్స్
- అటు వైసీపీలో గందరగోళం.. అధికారికంగా మూడు సీట్లే ప్రకటన
- మిగిలిన సీట్లపై స్పష్టత ఉన్నా ఇప్పటికీ వెల్లడించని వైసీపీ అధిష్ఠానం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ అభ్యర్థుల వెల్లడిలో టీడీపీ, జనసేన కూటమి దూకుడుపై ఉంది. కాకినాడ జిల్లాలో ఏడు సీట్లకుగాను ఇప్పటివరకు ఆరుచోట్ల అభ్యర్థులను ఖరారు చేసి స్పీడుపై ఉంది. ఇంకా ఒక్క కాకినాడ అసెంబ్లీ సీటు ఒక్కటే ప్రకటించాల్సి ఉంది. ఒకరకంగా చెప్పాలంటే అసెంబ్లీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఆందోళన నుంచి ఆలస్యమైనా ఏకంగా ఆరు సీట్లలో గెలుపుగుర్రాలను ప్రకటించి ఎన్నికల స్పీడు పెంచింది. వాస్తవానికి జిల్లాలో మూడు అసెంబ్లీ సీట్లలో అభ్యర్థులను మార్చి వైసీపీ ఎన్నికల వేడి పెంచింది. ఆ తర్వాత రోజులు గడిచినా టీడీపీ, జనసేన కూటమి నుంచి అభ్యర్థుల ఖరారు వేగం పుంజుకోలేదు. కానీ గత నెల 24న రెండు పార్టీలు కలిపి జిల్లాలో ఒకేసారి నాలుగు సీట్లు ప్రకటించింది. పెద్దాపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే చినరాజప్ప, జగ్గంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తుని నుంచి యనమల దివ్య పేర్లను ఖరారు చేసింది. కాకినాడ రూరల్ సీటును జనసేన తరఫున పంతం నానాజీ పేర్లను ఖరారు చేసి స్పీడు పెంచింది. మళ్లీ తాజాగా గురువారం ప్రత్తిపాడు సీటు టీడీపీ తరఫున వరుపుల సత్యప్రభ పేరు ఖరారైంది. పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్ తనే పోటీచేస్తున్నట్టు స్వయంగా ప్రకటించారు. ఈనేపథ్యంలో ఏడింటికిగాను ఆరు సీట్లలో టీడీపీ, జనసేన కూటమి స్పష్టత ఇచ్చేసింది. ఒక్క కాకినాడ సిటీ స్థానం నుంచి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని సమర్థవంతంగా ఎదుర్కొనే నేత కోసం బేరీజు వేస్తోంది. త్వరలో ఇక్కడ కూడా అభ్యర్థిత్వం ఖరారు కానుండా, మరోపక్క వైసీపీ మాత్రం సీట్ల ప్రకటనలో వెనుకబడిపోయింది. ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట స్థానాల్లో సిట్టింగ్‌లను పీకేసి కొత్త ఇన్చార్జులను నియమించింది. ఇంకా కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని సీట్లలో అభ్యర్థులను ఖరారు చేయలేదు. వీటికి సంబంధించి కాకినాడ సిటీ, జగ్గంపేట సీట్లలో కొన్ని మార్పులు చేయవచ్చని వైసీపీలో ప్రచారం జరుగుతోంది. కానీ వీటిపై ఇప్పటివరకు స్పష్టత లేక ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఈనెల 16న వైసీపీ సీట్లకు సంబంధించి తుది జాబితా వెల్లడికానుంది. అందులో మొత్తం సీట్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

పవన్ పోటీపై భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు



- టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలు దహనం
- వర్మకు పార్టీ అన్యాయం చేసిందంటూ మండిపాటు
- ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని డిమాండ్
- పవన్‌ను ఓడిస్తామంటూ ఆగ్రహావేశాలు

- 7లో



సార్వత్రిక ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టాలి

జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 14: సార్వత్రిక ఎన్నికల్లో నగదు, మద్యం వంటి ప్రలోభాలను సమర్థంగా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆమె ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలైన్ టీమ్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, డబ్బు పంపిణీ వంటి వాటిని అరికట్టాలన్నారు. అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి వాటిని ఎప్పటికప్పుడు ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. లక్ష రూపాయలకు మించి జరిగే లావాదేవీలు, ఒకే బ్యాంకు ఖాతా నుంచి మల్టిపుల్ బ్యాంకు ఖాతాలకు వెళ్లే లావాదేవీలను ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. రూ.10 లక్షల కంటే అధికంగా జరిగే లావాదేవీల వివరాలను ఆదాయపన్ను అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ భాస్కర్‌రావు, డీఎఫ్‌వో భరణి, ఇన్‌కంటాక్స్ అధికారి రామ్‌కుమార్, జీఎస్టీ జాయింట్ కమిషనర్ సుమతి, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల బసకు ఏర్పాట్లుచేయాలి

సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో పర్యటించే ఎన్నికల పరిశీలకుల బసకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కోర్టుహాలులో ఆమె ఎన్నికల పరిశీలకుల పర్యటన ఏర్పాట్లపై లైజాన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఆర్వో తిప్పే నాయక్, సీపీవో త్రినాథ్, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్ పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తం కింద రూ.14.27 కోట్లు పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి14: ఈబీసీ నేస్తం కింద జిల్లాలో 9,516 మంది లబ్ధిదారులకు రూ.14 కోట్ల 27 లక్షలను అందజేసినట్టు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. సీఎం జగన్ గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఈబీసీలకు బటన్‌నొక్కి సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమచేశారు. దానిలో భాగంగా కాకినాడ జిల్లాలో లబ్ధిదారులకు రూ.14 కోట్ల 27 లక్షలు జమచేశారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి ఆమె సీఎం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వెలమ ఇతర ఓసీ కులాల పేదల మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద ఏటా రూ.15 వేల ఆర్థికసాయాన్ని అందిస్తోందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పాల్గొన్నారు.

'రహదారి భద్రతతో రోడ్డు ప్రమాదాలు తగ్గాయి'

కలెక్టరేట్(కాకినాడ), మార్చి14: జిల్లాలో చేపట్టిన రహదారి భద్రతా కార్యక్రమాలతో గత సంవత్సరం రోడ్డు ప్రమాదాలు ఇరవై శాతం తగ్గాయని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు, గురువారం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో రహదారులను సురక్షితంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ప్రమాద మరణాలు కూడా 15 శాతం తగ్గాయన్నారు. కాకినాడలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న 14 జంక్షన్ల అభివృద్ధి, సిగ్నల్ లైటింగ్ ఏర్పాట్లుపై ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రపాలెం వంతెన అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ దృశ్యం

కనీస మద్దతు ధర చట్టం తేవాలని అఖిలపక్షం ధర్నా

కాకినాడసిటీ, మార్చి14: సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు చలో ఢిల్లీ రైతాంగ నినాదానికి మద్దతు తెలుపుతూ రైతు, కార్మిక, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఇంద్రపాలెం వంతెన అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పు ఆదినారాయణ, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. మోదీ ఇచ్చిన హామీ, స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు రైతుల పంటకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమంలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దువ్వ శేషుబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ పాల్గొన్నారు.

ఆర్వోలు, ఏఆర్వోలు వీరే

కాకినాడ సిటీ, మార్చి14: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీ రిటర్నింగ్ అధికారి (ఆర్వో), సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్వో)ల వివరాలను వెల్లడించారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ కృతికాశుక్లా (ఫోన్ నెంబర్ : 7993332244) వ్యవహరించనున్నారు. ఇక అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా తుని సహాయ రిటర్నింగ్ అధికారిగా కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి (ఫోన్: 9885135777), ప్రత్తిపాడు సహాయ రిటర్నింగ్ అధికారిగా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ శ్రీనివాసరావు (ఫోన్ : 98499 06007), పిఠాపురం సహాయ రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామచంద్రారెడ్డి (ఫోన్: 9849903919), కాకినాడ రూరల్ సహాయ రిటర్నింగ్ అధికారిగా కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇట్ల కిషోర్ (ఫోన్: 98499 03864), పెద్దాపురం సహాయ రిటర్నింగ్ అధికారిగా పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి జె సీతారామారావు (ఫోన్: 98499 03865), కాకినాడ సిటీ సహాయ రిటర్నింగ్ అధికారిగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు (ఫోన్: 91009 45696), జగ్గంపేట సహాయ రిటర్నింగ్ అధికారిగా ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీనివాసరావు (ఫోన్: 9704856327) వ్యవహరించనున్నారు.

రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (శుక్ర)	సా.6.21
	సహరి (శని)	ఉ.4.50

పవన్ పోటీపై భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు


జెండాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు దహనం చేస్తున్న కార్యకర్తలు

- టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలు దహనం
- వర్మకు పార్టీ అన్యాయం చేసిందంటూ మండిపాటు
- ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని డిమాండ్
- పవన్‌ను ఓడిస్తామంటూ ఆగ్రహావేశాలు

పిఠాపురం, మార్చి 14: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్టు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటన పిఠాపురంలో ప్రకంపనలు సృష్టించింది. పవన్ ప్రకటనపై తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలను దహనం చేశారు. రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టించి పనిచేసిన మాజీ ఎమ్మెల్యే వర్మకు టీడీపీ అన్యాయం చేసిందంటూ మండిపడ్డారు. తెలుగుదేశం, జనసేన పొత్తులో భాగంగా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్టు మంగళగిరిలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకే టిక్కెట్ వస్తుందని భావించిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు, ఇతర సామగ్రిని రోడ్డుపై వేసి దహనం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్మను పార్టీ నమ్మించి మోసగించిందని ఆవేదన వ్యక్తంచేశారు. పవన్‌ను ఓడించి తీరతామని స్పష్టంచేశారు. వర్మను ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని, తామంతా కష్టపడి పనిచేసి గెలిపించుకుంటామని తెలిపారు. తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కార్యకర్తలు, నాయకులకు అండగా నిలిచిన వర్మకు ఇంత అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. కార్యకర్తలు, నాయకుల ఆందోళనతో పిఠాపురం టీడీపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కనీసం జనసేనకు టిక్కెట్టు ఇస్తున్నట్టు చెప్పకపోవడంపై వారు మండిపడ్డారు.

భావోద్వేగానికి గురైన వర్మ

పిఠాపురం అసెంబ్లీ టిక్కెట్టు తనకే వస్తుందని ధీమాగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వర్మ పవన్ ప్రకటన అనంతరం పరిణామాలతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నాయకులు, కార్యకర్తలు వచ్చి తీవ్ర ఆగ్రహావేశాలతో మాట్లాడడంతోపాటు వర్మకు భరోసా ఇస్తూ మాట్లాడడంతో కన్నీరు పెట్టుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సంయమనం పాటించాలని, చేతులెత్తి నమస్కరించి కోరుతున్నానంటూ ఉద్వేగంతో మాట్లాడలేకపోయారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను ఎవరూ దూషించవద్దని కోరారు. ఇక్కడే పుట్టి పెరిగానని, 20 ఏళ్లగా కుటుంబాన్ని, వ్యాపారాన్ని వదులుకుని నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా భావించి, ప్రతి ఇంటి పెద్దకొడుకుగా కష్టించి పనిచేశానని చెప్పారు. ఓడిపోయిన మరుసటి రోజు నుంచే ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా ఉన్నానని తెలిపారు. తనతోపాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అదేవిధంగా పనిచేశామని చెప్పారు. తన సతీమణి, పిల్లలు వద్దన్నా కరోనా సమయంలో ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలోని వార్డు ప్రాణాలు తెగించి తిరిగి శానిటేషన్ చేశానని తెలిపారు. నేను ఎటువంటి వ్యక్తినో, ప్రజల కోసం ఎలా కష్టపడ్డానో, ప్రజాసమస్యలపై ఎలా పోరాడానో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. పవన్‌కు దీనికి ఎటువంటి సంబంధం లేదని, ఇది టీడీపీ వ్యవహారమని చెప్పారు.

నేడు కార్యకర్తల సమావేశం

భవిష్యత్తు కార్యక్రమంపై నిర్ణయం కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు ఏర్పాటుచేసుకున్న సమావేశానికి తాను హాజరవుతున్నానని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల అభీష్టం మేరకు పనిచేస్తానని, ఈ సమావేశంలో వారు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ప్రకటించారు.


పార్టీ కార్యాలయంలో వర్మ సమక్షంలోనే ఆందోళన

మాజీ ఎమ్మెల్యే వర్మకు చంద్రబాబు ఫోన్ : తొందరపాటు నిర్ణయాలు వద్దని సూచన

పిఠాపురం, మార్చి 14: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం రాత్రి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మకు ఫోన్ చేశారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో జరిగిన పరిణామాలతో చంద్రబాబు వర్మకు ఫోన్ చేసి మాట్లాడారు. తొందరపడి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పారు. అన్ని విషయాలు మాట్లాడదామని, టీడీపీ కేంద్ర కార్యాలయానికి రావాలని సూచించారు. అయితే శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం ఏర్పాటుచేసుకున్నారని, అందులో పాల్గొన్న తర్వాత లేదా శనివారం వస్తానని చంద్రబాబుతో వర్మ చెప్పినట్టు సమాచారం. చంద్రబాబు ఫోన్ చేసిన విషయాన్ని తెలుగుదేశం పార్టీ వర్గాలు ధ్రువీకరించాయి.

సాధారణ గిరిజన మహిళకు టీడీపీ ఎమ్మెల్యే టికెట్

రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా అంగన్‌వాడీ కార్యకర్తను ఎంపిక చేసిన చంద్రబాబు


ఎన్టీఆర్‌కు నమస్కరిస్తున్న శిరీషా

రంపచోడవరం, మార్చి14: రంపచోడవరం టీడీపీ అభ్యర్థినిగా మిరియాల శిరీషాదేవి అనే విద్యావంతురాలైన గిరిజన యువతిని ఖరారు చేస్తూ తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే విషయంలో తీవ్ర స్థాయిలో వడబోత సాగించి పార్టీ ఎట్టకేలకు మిరియాల శిరీషను ఎంపిక చేసింది. ఇక్కడ టికెట్ కోసం ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న వంతల రాజేశ్వరి, పార్టీలోని సీనియర్ నాయకులు కూడా ప్రయత్నాలు సాగించారు. కాగా అరకు పార్లమెంట్‌కు బీజేపీ తరపున బరిలో నిలుస్తున్న కొత్తపల్లి గీత ఆశీస్సులు మెండుగా ఉండటం మిరియాల శిరీషకు కలిసి వచ్చింది. మిరియాల శిరీష కోయ సామాజిక వర్గానికి చెందిన మహిళ. గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన చోడి మల్లికార్జున, కారం బాపన్నదొరలతో ఆమె కుటుంబానికి బంధుత్వం ఉంది. విలీన మండలాలతో కలిపి నియోజకవర్గంలో ఆమె సామాజిక వర్గం ఓటర్లు అధికంగా ఉండటం, ఆమె భర్త సామాజిక వర్గం కూడా సానుకూలంగా మారి ఆమెకు కలిసివచ్చే అంశంగా ఉంది. డిగ్రీతో పాటు బీఈడీ చేసిన ఆమె అంగన్వాడీ కార్యకర్తగా గతంలో పనిచేశారు. అయితే ఎమ్మెల్సీ అనంతబాబు వేధింపులతో ఆమె ఆ పోస్టుకు రాజీనామా చేశారు. శిరీష అత్తమామలు అనంతగిరికి సర్పంచ్‌లుగా పని చేశారు. ఆమె భర్త మఠం విజయభాస్కర్ తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

టీచర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సర్పవరం జంక్షన్, మార్చి 14: కాకినాడ రూరల్ వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో వివిధ ఉపాధ్యాయుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్కూల్ ప్రిన్సిపాల్ బొంత శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన సోషల్ స్టడీస్ కంప్యూటర్స్, సైన్స్, ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, నర్స్, స్పోర్ట్స్ కోచ్, కౌన్సిలర్ తదితర పోస్టుల భర్తీ కోసం ఈనెల 16న శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పోస్టుల కోసం అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు విద్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకి శనివారం ఉదయం 8.30 గంటలకు సంబంధిత విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం విద్యాలయ వెబ్‌సైట్ www.kakinada.kvs.ac.inలో పరిశీలించుకోవాలన్నారు.

శునకాలు దాడి చేయడంతో బైక్‌తో గోడను ఢీకొన్న విద్యార్థి

తలకు తీవ్రమైన గాయం కావడంతో మృతి


మోహనకృష్ణ

యానాం, మార్చి 14: ఒక్కసారిగా శునకాలు దాడి చేయడంతో ఓ విద్యార్థి భయపడి బైక్‌తో గోడను ఢీకొట్టి చనిపోయాడు. ఈ విషాదకర సంఘటన యానాంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల మేరకు యానానికి చెందిన విద్యార్థి వంటపాటి శివమోహన కృష్ణ (19) తండ్రి శ్రీనివాస్ (గాంధీ) స్థానిక ఫైర్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున శ్రీనివాస్‌కు జెర్రి కుట్టడంతో కుమారుడు మోహనకృష్ణతో కలిసి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. అయితే శ్రీనివాస్‌ను కొంత సమయం ఆస్పత్రిలోనే ఉండమని వైద్యులు సూచించడంతో అక్కడే ఉండిపోయాడు. అయితే మోహనకృష్ణకు పరీక్షలు ఉండటంతో చదువుకోవడానికి ఇంటికి వెళ్లిపొమ్మని శ్రీనివాస్ చెప్పాడు. దీంతో అక్కడే ఉన్న బైక్‌తో తిరిగి వస్తుండగా ఫైర్‌స్టేషన్ సమీపంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకోబోయి ఫైర్‌స్టేషన్ గోడను బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న అతడిని యానాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మోహనకృష్ణ మృతి చెందాడు. మోహనకృష్ణ యానాం అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. కుక్కలను నిరోధించకపోవడం వల్లనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదంలో గోదావరి డెల్టా ఇరిగేషన్ వ్యవస్థ

- నిర్వహణ నిధులు లేక లాకులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి
- కాల్వల్లో పూడిక పేరుకుపోయి నీరు ముందుకుపోవడం లేదు
- ప్రభుత్వం నిర్వహణ నిధులు కూడా ఇవ్వకపోతే ఎలా!
- కనీసం రంగులు, గ్రీజుకు సైతం నోచుకోని వైనం
- ఇలాగైతే డెల్టా ప్రాంతం బీడుగా మారిపోతుంది
- జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ రంగస్వామి


పి.గన్నవరం అక్విడెక్టు వద్ద కాల్వతొట్టెను పరిశీలిస్తున్న రంగస్వామి

పి.గన్నవరం, మార్చి 14: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని గోదావరి డెల్టాల్లో ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రమాదంలో ఉందని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ అలగేషన్ రంగస్వామి హెచ్చరించారు. కాల్వలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని లాకుల తలుపులు కనీసం రంగులు, గ్రీజుకు కూడా నోచుకోని పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయని చెప్పారు. ఇక్కడ ప్రభుత్వం కనీసం నిర్వహణ నిధులు కూడా మంజూరు చేయలేదా అని ఆయన ప్రశ్నించారు. కాల్వల విషయంలో ఇదే ఒరవడి కొనసాగితే రాబోయే రోజుల్లో డెల్టా ప్రాంతం భూములన్నీ పూర్తిగా బీడుగా మారిపోతాయని ఆయన ప్రభుత్వాన్ని పరోక్షంగా హెచ్చరించారు. గోదావరి డెల్టాప్రాంతంలోని రెండు రోజులు పర్యటనలో భాగంగా గురువారం పి.గన్నవరం అక్విడెక్టును ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. మొదటిరోజు ద్రాక్షారామ, రావులపాలెం, మండపేట, కాకినాడ కెనాల్, సామర్లకోట, లొల్లలాకులు, రెండో రోజు నర్సాపురం, వేల్పూరు కెనాల్, అంతర్వేది గోదావరి సాగర సంగమం తదితర ప్రాంతాలను పరిశీలించడంతో పాటు పది నుంచి పన్నెండు లాకులను, ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించామన్నారు. ఈ పరిశీలనలో ఎక్కడ చూసిన ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావడం లేదని చెబుతున్నారన్నారు. లాకుల తలుపులన్నీ పూర్తిగా తుప్పుపట్టి చాలా దుర్భరంగా ఉన్నాయన్నారు. కొన్ని చోట్ల అయితే తలుపులు సిస్టం పూర్తిగా దెబ్బతిందన్నారు. కాల్వలన్నీ పూర్తిగా తూడు, పూడికతో అత్యంత దయనీయంగా ఉన్నాయని చెప్పారు. తక్కువ నీరును విడుదల చేసినప్పటికి పూర్తిస్థాయిలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా ఉండాలని కానీ ఇక్కడ అందుకు భిన్నంగా కాల్వలు ఉన్నాయని చెప్పారు. తూడు, పూడికతీత తొలగించడానికి నిధులు లేవని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఇరిగేషన్ వ్యవస్థకు పెద్ద మొత్తంలో ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ప్రభుత్వం కూడా భారీ మూల్యం చెల్లించుకోవల్సిందేని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆదిలోనే చర్యలు తీసుకుంటే వ్యవస్థ మారుతుందన్నారు. ఈఈ బత్తుల వెంకటస్వామి, పి.గన్నవరం డీఈ వెంకటేశ్వరరావు, నర్సాపురం డీఈ సత్యనారాయణ, జేఈ సుందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దాతలకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 14: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన పి.మిథుల్‌చక్రవర్తి-ఉషాకిరణ్ దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,89,576 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. దేవస్థానంలోని హుండీలను ఈ నెల 20వ తేదీ ఉదయం పది గంటలకు పర్యవేక్షణాధికారుల సమక్షంలో తెరిచి లెక్కిస్తామని ఆయన చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు

ఆత్రేయపురం, మార్చి 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికను ఉండ్రాజవరం మండలం పాలంగికి చెందిన కడలి దుర్గాప్రసాద్ ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఆన్‌లైన్‌లో ఫొటోలు పెడతానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. బాలిక ఫొటోను ఫ్లెక్సీపై అంటించి ఫోన్ నెంబరు వేశారు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

పుదుచ్చేరి వరకు సర్కారు ఎక్స్‌ప్రెస్



సామర్లకోట, మార్చి 14: కాకినాడ-చెంగల్పట్టు-కాకినాడ మధ్య రాకపోకలు సాగిస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి పుదుచ్చేరి వరకు నడవనుంది. సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించడం యానాం ప్రజల చిరకాల వాంఛ. సామర్లకోట మీదుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు సాగించనుండడంతో సామర్లకోట పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది రైలు ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరనుంది. ఈ మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారులకు రైల్వే సీపీటీఎం అధికారి నుంచి అందిన ఆదేశాలను గురువారం రాత్రి ఆంధ్రజ్యోతి సేకరించింది. 17652 నంబరు గల కాచిగూడ-చెంగల్పట్టు-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు పుదుచ్చేరి వరకూ వారంలో మూడు రోజుల పాటు ఆదివారం, బుధవారం, గురువారంలో పుదుచ్చేరి వరకూ వెళ్లనుంది. 17651 నంబరు గల చెంగల్పట్టు-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు పుదుచ్చేరి నుంచి కాచిగూడ వరకూ వారంలో మూడు రోజుల పాటు అనగా సోమవారం, గురువారం, శుక్రవారంలలో వెళ్లనుంది. 17644 నంబరు గల కాకినాడ-చెంగల్పట్టు మధ్య రాకపోకలు సాగిస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-పుదుచ్చేరి మధ్య ఆదివారం, బుధవారం, గురువారం నడవనుంది. మిగిలిన నాలుగు రోజులలో అనగా సోమవారం, మంగళవారం, శుక్రవారం, శనివారాలలో కాకినాడ-చెంగల్పట్టు మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. 17643 నంబరు గల చెంగల్పట్టు-కాకినాడ మధ్య రాకపోకలు సాగిస్తున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు చెంగల్పట్టు-కాకినాడ మధ్య మిగిలిన నాలుగు రోజులు అనగా మంగళవారం, బుధవారం, శనివారం, ఆదివారంలో రాకపోకలు సాగించనుంది. ఈ మేరకు గురువారం పుదుచ్చేరి-కాచిగూడ మధ్య పొడిగించిన రైలు ప్రారంభమైంది. ఈనెల 15న కాకినాడ-చెంగల్పట్టు మధ్య ఈ నెల 16న చెంగల్పట్టు-కాకినాడ మధ్య పొడిగించిన రైళ్ల ప్రారంభం కానున్నాయి. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కార్యాలయం నందు సిబ్బంది ద్వారా తెలుసుకోవచ్చని, పాత టైమింగ్స్‌లోనే రైలు రాకపోకలు సాగించనుందని రైల్వే అధికారి కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వులలో తెలిపారు. కాగా కాకినాడ, సామర్లకోట మీదుగా పుదుచ్చేరి ప్రాంతానికి ఏకైక ఎక్స్‌ప్రెస్ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే కావడం విశేషం.

దేవదాయ శాఖ మంత్రి పర్యటన వాయిదా

అన్నవరం, మార్చి 14: అన్నవరం దేవస్థానంలో శుక్రవారం జరగాల్సిన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటన వాయిదా పడినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. జాతీయ రహదారిపై నమూనాలయం వద్ద ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను సిద్ధం చేయగా ఆకస్మికంగా మంత్రి కార్యాలయం నుంచి దేవస్థానం అధికారులకు కార్యక్రమం శనివారానికి వాయిదా వేసినట్లు వర్తమానం రావడంతో శనివారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా అశోక్

కాకినాడ సిటీ, మార్చి 14: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా కాకినాడకు నగరానికి చెందిన బసవా అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 16 మంది ఏపీఐఐసీ డైరెక్టర్లను నియమిస్తూ గురువారం జీవో నంబర్ 66 జారీ చేసింది. ఈ సందర్భంగా తనను డైరెక్టర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముమ్మిడివరం, మార్చి 14: 58 సంవత్సరాల క్రితం ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ముమ్మిడివరంలో తాము విద్యను అభ్యసించిన పాఠశాలలో కలుసుకున్నారు. ముమ్మిడివరం జడ్పీ హైస్కూల్‌లో 1966-69 సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు 80 మంది ఒక్కచోట సమావేశమై చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకుని ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకుంటూ ఆ తియ్యటి జ్ఞాపకాలతో ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులు పోర్ల సుబ్బారావు, పుల్లెల భీమశంకరం, చివుకుల రాము, సీహెచ్‌వీఆర్కే ఆచార్యులను సత్కరించారు. పోర్ల కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూకల శంకరం, గంటా సత్యనారాయణ, కుందూరు విశ్వప్రసాద్, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోలీసుల సంరక్షణలో బాలుడు

ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని కోరిన పోలీసులు



సామర్లకోట, మార్చి 14: సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డుపై అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న పది సంవత్సరాల వయస్సు గల బాలుడిని గురువారం సాయంత్రం సామర్లకోట పోలీసులు సంరక్షించారు. బాలుడి తల్లితండ్రులు ఎవరనే విషయమై పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి వద్ద ఉన్న పుస్తకంలో బి. ప్రభ అని మాత్రమే ఉందని బాలుడు నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని పోలీసులు తెలిపారు. బాలుడి ఫొటోతో మహిళా పోలీసులు పలు ప్రసార మాధ్యమాలలో ప్రసారం చేశారు. ఆచూకీ తెలిసిన వారు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు కోరారు.

18 ఇసుక లారీలు పట్టివేత


పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఇసుక లారీలు

ఎటపాక, మార్చి14 తెలంగాణలోని ర్యాంపు నుంచి ఇసుక రవాణా చేస్తున్న 18 ఇసుక లారీలను గురువారం రాష్ట్ర సరిహద్దులోని ఎటపాక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం, తూరుబాక ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను ఆంధ్రా మీదుగా తెలంగాణకు తరలిస్తుండగా పోలీసులు నిలుపుదల చేశారు. అయితే ఇసుక లారీలకు వేబిల్లులు, సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో పట్టుకున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. పట్టుకున్న లారీలను రహదారి పక్కకు నిలిపి, అనుమతి పత్రాలను పరిశీలిస్తున్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

ముమ్మిడివరం, మార్చి 14: పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సాల్ట్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆషిక్ అలీబేగ్ సూచించారు. ముమ్మిడివరం మండలం ఠాణేలంకలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఆయన సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావుతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలీబేగ్ మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లాలో ఎంపికచేసిన వివిధ యాజమాన్యాల పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులకు భద్రత ఏవిధంగా ఉంది, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి ఎలా ఉంది, పాఠశాలలో లైబ్రరీ ఏవిధంగా ఉపయోగపడుతుంది, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు విద్యార్థులకు ఏ మేరకు వినియోగించుకుంటున్నారు, మౌలిక వసతులు ఏవిధంగా ఉన్నాయి తదితర అంశాలను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో కిచెన్, వంట షెడ్లు, డైనింగ్ హాలు, తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించారు. వారి వెంట సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి. రాంబాబు, సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పొట్లవాయిగూడెంలో చోరీ

కూనవరం,మార్చి14: మండలంలోని పొట్లవాయిగూడెంలో ఓ గిరిజనుడి ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కుడియం వెంకటేష్ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే చొరబడి రూ.20 వేలు దొంగలించారు. వెంకటేష్ యథావిధిగా ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చాక ఇంటి ముందు తాను పెంచుకున్న రెండు కోడిపుంజులు కనిపించలేదు. అయితే అవి ఎక్కడికిపోయాయని చుట్టుపక్కల వెతికాడు. ఈలోగా ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇటీవల వ్యవసాయంలో వచ్చిన రూ.20 వేలు సొమ్ము కనపడలేదు. దీంతో వెంకటేష్ తన ఊరి పరిధిలో ఉన్న సీసీ పుటేజీలు పరిశీలించగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తిరిగినట్లు పుటేజీలో కనపడుతుంది. వారిని అనుమానితులుగా భావిస్తున్నారు.

కాకినాడ

'దివ్యాంగుల విద్యా ప్రగతికి కృషిచేయాలి'

ప్రత్తిపాడు, మార్చి 14: భవిత కేంద్రాల్లోని దివ్యాంగులు విద్యాప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ క్లస్టర్ మానటరింగ్ అధికారి చామంతి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని ధర్మవరం హైస్కూల్లో భవిత దివ్యాంగులకేంద్రాన్ని గురువారంఆయన సందర్శించారు. సీఎంవో చామంతి మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని దివ్యాంగుల బోధనా సామర్థ్యాన్ని పరిశీలన చేసివారి విద్యాప్రగతికి తోడ్పాటునందించాలన్నారు.

బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన

సామర్లకోట, మార్చి 14: గ్రామాల్లో తరచూ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలకు చట్టపరమైన సంరక్షణ కల్పించి కృషి చేయాలని ఎస్‌ఎస్ ప్రాజెక్ట్ అధికారిణి విజయ అన్నారు. సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో కలిసి బేటీ బచావో, బేటీ పడావో అవగాహనా సదస్సు గురువారం పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు జీవీలక్ష్మి, కె.నిర్మలాకుమారి, ఎం.వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

'విద్యాజ్యోతి' స్కాలర్‌షిప్‌లు అందజేత

కరప, మార్చి 14: స్థానిక హైస్కూల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులకు విద్యాజ్యోతి పథకం కింద స్కాలర్ షిప్‌లు అందించినట్లు కెనరా బ్యాంక్ కరప దేవాలయం వీధి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వి.మల్లేశ్వరరావు తెలిపారు.

కౌంటింగ్ సెంటర్ల సందర్శన

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 14: కాకినాడ, తుని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు జె.వెంకటరావు, కె.రాజ్యలక్ష్మి గురువారం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు.కాకినాడ,తుని నియోజకవర్గాలకు సంబంధించి జేఎన్టీయూకే సివిల్ బ్లాక్‌లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లను కేటాయించారు. తహసీల్దార్ దేవ, డీటీలు పాల్గొన్నారు.

మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంచుకోవాలి

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 14: మూత్రపిండాలు(కిడ్నీలు) ఆరోగ్యంగా ఉంచుకోవాలని కాకినాడ అపోలో ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రపంచ కిడ్నీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక హోటల్లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కిడ్నీ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. డాక్టర్ బివిరావు, వైద్యులు అనిల్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, శర్మిష్టపాణిగ్రాహి, పి.నాగేశ్వరరావు, ఎస్‌వి రమణ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

కోటనందూరు, మార్చి 14: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే చైతన్య గోదావరి బ్యాంక్ లక్ష్యమని బీఎం బాబ్జిరావు అన్నారు. గురువారం కోటనందూరు చైతన్య బ్యాంక్‌లో ప్రథమ వార్షిక వేడుకలు నిర్వహించారు.

ఇళ్ల స్థలాల కోసం నిరసన

తాళ్లరేవు, మార్చి 14: లొల్లంలో స్థానికులకే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని స్థానికులు చేపడుతున్న నిరసన దీక్ష కొనసాగుతోంది. ఇళ్లస్థలాలకోసం నిరసన దీక్ష ఆపేది లేదని మేడపాటి దేవానందం, పులపాకల దినబాబు డిమాండ్ చేశారు.

'వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి'

తాళ్లరేవు, మార్చి 14: సంక్షేమ పథకాలు ఇస్తున్నామని ప్రజలను మభ్యపెడుతూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న మోసపూరిత ప్రభుత్వానికి ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పోలేకుర్రు క్లస్టర్ ఇన్‌చార్జి జక్కుల ప్రసాద్ బాబు అన్నారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మాట్లాడారు.

రౌతులపూడి తహశీల్దార్‌గా విద్యాపతి

రౌతులపూడి, మార్చి 14: మండల తహశీల్దార్‌గా సిహెచ్ విద్యాపతి నియమితులయ్యారు. భీమవరంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తూ ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

ఓటుహక్కుప్రాముఖ్యతపై అవగాహన

పెద్దాపురం, మార్చి 14: ఓటుహక్కు ప్రాముఖ్యతపై ఉపాధి వేతనదారులకు ద్వాపా పీడీ అడపా వెంకటలక్ష్మి గురువారం అవగాహన కల్పించారు. సీబీ దేవంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఆమె ఉపాధి వేతనదారులతో ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

బీఎస్ఎఫ్ జవాన్ల ఫ్లాగ్‌మార్చ్

కత్తిపూడి, మార్చి 14: మండలంలోని పలు గ్రామాల్లో సీఐ ఎస్ఎఫ్ బీఎస్ఎఫ్ జవాన్లతో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఓటర్లకు భరోసా కల్పిస్తూ ఎస్ఐపీవో హనుమంతరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ పరిశీలన

తుని రూరల్, మార్చి 14: ఈనెల 18 నుంచి పదోతరగతి పరీక్షలు నేపథ్యంలో డీఈవో డీవీఎస్ హనుమవరంలోని మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. గురుకుల ఎంఈవో గీతాదేవి, ఎంఈవో2 రమణక్క, పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మజ ఉన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

కొత్తపల్లి, మార్చి 14: తీరప్రాంత గ్రామాల్లో సముద్రంలోకి ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు తొలగించాలని డిమాండ్ చేస్తూ కోనపాపపేటలో మత్స్యకారులు నిర్వహిస్తున్న ఆందోళన గురువారానికి 8వరోజుకు చేరింది. పైప్‌లైన్లు తొలగించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందన్నారు.

పిఠాపురంలో జనసేన సంబరాలు



పిఠాపురం, మార్చి 14: పిఠాపురంలో జనసేన శ్రేణులు సంబరాల్లో మునిగారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురంనుంచి పోటీ చేస్తానని ప్రకటించడంతో జనసైనికులు, వీరమహిళలు ఆనందం వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనసైనికులు, నాయకులు, వీరమహిళలు పిఠాపురం పట్టణంలో గురువారం రాత్రి భారీ మోటార్ సైకిల్, కార్ల ర్యాలీ నిర్వహించారు. పవన్‌ను రాష్ట్రంలోనే రికార్డుస్థాయి మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు.

గొల్లప్రోలు/కొత్తపల్లి, మార్చి14: గొల్లప్రోలు పట్టణం, మండలంలోపాటు కొత్తపల్లిలోని పలు గ్రామాల్లో జనసైనికులు పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్టు ప్రకటనతో సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చారు.

ఏపీపీఎస్సీలో రూ.150కోట్ల కుంభకోణం బహిర్గతం

కాకినాడ సిటీ, మార్చి 14: సంతలో పశువులను అమ్మినట్టుగా జగన్ ఏపీపీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకుని రూ.150కోట్ల భారీ కుంభకోణం చేసి నిరుద్యోగ యువతను మోసం చేశాడని టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు వనమాడి మోహన్‌వర్మ ధ్వజమెత్తారు. ఏపీపీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో గురువారం కాకినాడలో ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు నిరసన తెలిపారు. ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు మోహన్‌వర్మ, నగర తెలుగు యువత అధ్యక్షుడు చింతలపూడి రవి, టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు నీలాపాలు నన్ని, దింతా సతీష్, పాలిక సూర్య, నానవరపు సుబ్రహ్మణ్యం, శ్రీను పాల్గొన్నారు.

'సీఎం ప్రభుత్వం రాజీనామా చేయాలి'

సర్పవరం జంక్షన్, మార్చి 14: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో 2018లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అనేక అవకతవకలు జరిగాయని, ఈ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో సీఎం జగన్ రాజీనామా చేయాలని టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు సత్యనారాయణమూర్తి, అనంతలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం వలసపాకల పార్టీ శ్రేణులతో కలసి నిరసన తెలిపారు.

'వైసీపీని గద్దె దించాల్సిందే'

కరప, మార్చి 14: నిరుద్యోగులను నిలువెల్లా దగా చేసిన

కాకినాడలో టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ నిరసన

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబి) పిలుపునిచ్చారు. గురువారం కరప తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న, తెలుగు మహిళా అధ్యక్షురాలు కోన వెంకటలక్ష్మి, కొల్లాబత్తుల అప్పారావు, కొండా వినయ్, బచ్చల కామేష్, మార్నిండేయులు, సత్తిబాబు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

'విజయమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలి'

కరప, మార్చి 14: వచ్చే ఎన్నికల్లో మన విజయమే లక్ష్యంగా ఇరు పార్టీల శ్రేణులు పనిచేయాలని కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కోకోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి పిలుపు ఇచ్చారు. కరప మండలం జడ్.భావారం, కూరాడల్లో గురువారం వారు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీని గెలిపించాలని కోరారు. కూరాడ సభలో జనసేనపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నానాజీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఇరు పార్టీల మండలాధ్యక్షులు దేవు వెంకన్న, బండారు మురళి, నాయకులు బోగిరెడ్డి గంగాధర్, బొగిరెడ్డి కొండబాబు, మామిడాల వెంకటేష్, కోటగిరి మహేంద్రబాబు, వెలుగుబంట్ల సూరిబాబు, పాట్నీడి చిట్టి, దుగ్గన బాబ్జి, దూడల నారాయుడు, తలాటం సతీష్, గుణ్ణం శ్రీనివాస్, మెల్లం రాంబాబు, దాసరి సూరిబాబు, యాలిష్‌కుమార్, కాశా శ్రీను, నాయుడు పాల్గొన్నారు.

సత్యప్రభ టిక్కెట్‌పై ప్రత్తిపాడులో హర్షాతిరేకాలు



సత్యప్రభను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, మార్చి 14: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా వరుపుల సత్యప్రభ ఎంపికపై నాలుగు మండలాల్లోని అభిమానులు, నాయకులు, శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ప్రత్తిపాడులో సత్యప్రభకు పార్టీ టిక్కెట్ కేటాయించిన సందర్భంగా అభిమానులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చి ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. తాటిపర్తిలో నివాసం ఉంటున్న సత్యప్రభ వద్దకు నియోజకవర్గం నలుమూలల నుంచి శ్రేణులు, నాయకులు తరలివచ్చి గజమాలలతో ఆమెను సన్మానించి అభినందించారు.

యనమలకు సత్యప్రభ కృతజ్ఞతలు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుకు ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబు తనకు పార్టీ టిక్కెట్ కేటాయించడంపట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఇందుకు సహకరించినందుకు గురువారం తేటగుంట వెళ్లి యనమలకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పత్తివాడు సూర్యనారాయణ, అమలాపురం పరిశీలకుడు కొమ్ముల కన్నబాబు, వర్తన సురేష్, వెన్నా శివ, బద్ది రామారావు, ఇతంశెట్టి భాస్కరబాబు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

సత్యప్రభకు టికెట్ కేటాయింపుపై సంబరాలు

శంఖవరం, మార్చి 14: ప్రత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్ వరుపుల సత్యప్రభకు కేటాయించడంపై మండలంలోని గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. వజ్రకూటం, నెల్లిపూడి, మండపం, శంఖవరం, కత్తిపూడి గ్రామాల్లో బాణసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కత్తిపూడి వచ్చిన సత్యప్రభకు టీడీపీ మండల అధ్యక్షుడు బద్దిరామారావు, వర్తన సురేష్, వెన్నా ఈశ్వరుడు, కేర్ల వెంకట సుబాష్ అభినందనలు తెలిపారు.

'భారీ మెజార్టీతో నెగ్గించుకుంటాం'

రౌతులపూడి, మార్చి 14: ప్రత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని భారీమెజార్టీతో నెగ్గించుకుంటామని టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ గొల్లపల్లి దొరబాబు అన్నారు. సత్యప్రభకు టిక్కెట్ కేటాయించడంపై పార్టీనేతలు పైల పైడిరాజు, సోమరోతు రవి, చింతకాయలరాజు, కోమలి కృష్ణవర్మ, తిరుమల దొర, గుండ్రాజు దివాణం, జేట్ల రాజా, నందమూరి రాజా, గొల్లు పెదదివాణం, కాకర సత్తిబాబు, సింహాద్రి పెదబాబు హర్షం వ్యక్తం చేశారు.

200మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

శంఖవరం, మార్చి 14: అచ్చంపేటకు చెందిన 200మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. గ్రామ నాయకులు బొట్టా అప్పలరాజు, కురందాసు తాతాజీ, మామిడి శ్రీను ఆధ్వర్యంలో కార్యకర్తలు బొట్టా చిన సత్యనారాయణ, నక్కా నూకరాజు, చింతపల్లి గంగాధర్‌తోపాటు 200మంది పార్టీలో చేరగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బద్దిరామారావు, వెన్నా ఈశ్వరుడు, ఓలేటి లక్ష్మీనారాయణ, ఉల్లి వీరబ్రహ్మం, పిల్ల అప్పారావు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీ చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న నెహ్రూ

జగ్గంపేట, మార్చి 14: జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామానికి చెందిన అప్పబత్తుల లోవరాజు, సీతానగరం గ్రామానికి చెందిన కుదప మురళి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కారకుడైన నెహ్రూ నాయకత్వంలో పనిచేసి చంద్రబాబును సీఎం గెలిపించుకుంటామన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొండబాబు, మునిరెడ్డి నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి, కరణ్ బుజ్జిబాబు, ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ బీసీ నేత టీడీపీలో చేరిక

జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో వైసీపీ బీసీ నేత బూర్లు అప్పలరాజు వైసీపీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు ఆయన సోదరుడు బూర్లు చిన్నఅప్పలరాజు టీడీపీ చేరారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, నండ్ర బిరంజీవి, వాకా రెడ్డి, బోర సత్తిబాబు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

గెద్దనాపల్లి వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

జగ్గంపేట, మార్చి14: కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన యాదవ సంఘం నాయకులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో ఇరిపాకలోని ఆయన ఇంటివద్ద పార్టీలో చేరారు. ఈపీ త్రిమూర్తులు, సాప్ప మునియయ్య, సాప్ప తాతరావు, ఈపీ రాంబాబు, బాలబోయిన రాంబాబు, సాప్ప గంగాధర్‌రావు తదితర 20 కుటుంబాలవారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

టీడీపీ, జనసేన కూటమితో అన్ని వర్గాలకు మేలు: దివ్య



ఎస్.అన్నవరంలో ప్రచారం చేపడుతున్న యనమల దివ్య

తుని రూరల్, మార్చి 14: టీడీపీ, జనసేన మేనిఫెస్టోతో అన్నివర్గాలకు మేలు జరుగుతుందని తుని టీడీపీ అభ్యర్థి యనమల దివ్య స్పష్టం చేశారు. ఎస్.అన్నవరంలో ఇంటింటా ప్రచారం చేపట్టిన ఆమె ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యనమల శివరామకృష్ణన్, చింతమనీడి నాగ సోమరాజు, బొడితెట్టి వెంకటేష్, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, వంగలపూడి శ్రీనివాస్, గజ్జి అప్పలరాజు ఉన్నారు.

'రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ కూటమిని గెలిపించాలి'

తొండంగి, మార్చి 14: రాష్ట్ర భవిష్యత్ కోసం రానున్న ఎన్నికల్లో తమ కూటమిని గెలిపించాలని తుని నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య కోరారు. గురువారం ఆమె బెండపూడిలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, టీడీపీ, జనసేన తొండంగి మండలాధ్యక్షులు బొర్రా అప్పారావు, బెండపూడి నాయుడు, యనమల రాజేష్, పేకేటి హరికృష్ణ, సాదనాల నూకరాజు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమితోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 14: టీడీపీ, జనసేన కూటమితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండలంలోని చదలాడలో గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి దూరమైపోయిందన్నారు. రాష్ట్రం పూర్తిగా తిరోగమనంలోకి వెళ్లిపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలిశెట్టి నాని, తుమ్మల నాని, దాగంటి గోపాలకృష్ణ, మేడిది శ్రీనివాస్, మొయిళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

సామర్లకోట, మార్చి 14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కూటమి పార్టీ విజయం చారిత్రక అవసరమని పెద్దాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు అన్నారు. జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సామర్లకోట వాటర్‌ట్యాంకుల వద్ద, గాంధీనగర్‌లో పార్టీ పతాకాలను ఆయన ఆవిష్కరించారు. పార్టీ నాయకులు సరోజావాసు, మంచెం సాయిబాబు, ఆత్తిలి కృష్ణ, మండపల్లి దినబాబు, తుమ్మల ప్రసాద్, పెంకే వెంకటలక్ష్మి, కరణం కామేశ్వరరావు, తోట సాయి, జనకి రామారావు పాల్గొన్నారు.

పెనుగుదురు(కరప), మార్చి 14: పెనుగుదురు పార్టీ కార్యాలయంలో గురువారం జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు తుమ్మలపల్లి మాధవరావు, రెడ్డిపల్లి నారాయణరావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి జనసైనికులకు తినిపించారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో రూరల్ అభ్యర్థి పంతం నానాజీని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు గుంటా నానిబాబు, మండల అధ్యక్షుడు బండారు మురళి, రెడ్డిపల్లి భాస్కర్, పప్పిరెడ్డి వెంకటబాబు, యార్ల హరినాథ్, తుమ్మల సత్యనారాయణ, పప్పిరెడ్డి హరిబాబు పాల్గొన్నారు.

పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి

సర్పవరం జంక్షన్, మార్చి 14: పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేనాని పవన్‌కళ్యాణ్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించి బహుమతిగా ఇస్తామని రూరల్ కాకినాడ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. గురువారం వలసపాకల గంగరాజునగర్‌లో జనసేన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబీ), మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ప్రమాదవశాత్తూ మృతిచెందిన పార్టీ క్రియాశీలక కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందించారు. జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు కరెడ్ల గోవిందు, రాంబాబు సీతయ్యదొర, శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, పాలిక రమణ, కొజ్జా సర్పంచ్, చైర్మన్ శ్రీను, పల్ల శ్రీరాములు, కిషోర్ పాల్గొన్నారు.

జగ్గంపేటలో కార్యకర్తల ఆత్మీయ కలయిక

జగ్గంపేట, మార్చి 14: జగ్గంపేటలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిమానులతో రెండో రోజు మండలంలో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. ముందుగా కాట్రావులపల్లిలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలు నెహ్రూకు స్వీట్లు పంచారు. కాట్రావులపల్లి, సీతానగరం, జె.కొత్తూరు, సీతారాంపురం, రామవరం, కృష్ణాపురం, వెంగయమ్మపురం, మల్లిశాల, గోవిందపురం, మన్యంవారిపాలెం, జగ్గంపేటల్లో కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి బొదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పవర్‌స్టార్ పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జనసేన నాయకులు పాలిశెట్టి సతీష్, మొగలి గంగాధర్ పాల్గొన్నారు.



కరపలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



కాకినాడ రూరల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న పంతం నానాజీ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 14: రాబోయే నెలరోజులు చాలా విలువైనవని పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసి ఎన్నికల్లో నెగ్గాలని పన్నాగాలు పన్నుతుందని, వాటిని తిప్పికొట్టేందుకు జనసైనికులు సిద్ధంగా ఉండాలని ప్రతిజ్ఞ బూనారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని గురువారం సిటీ జనసేన కార్యాలయంలో జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, బొడిశెట్టి శ్రీమన్నారాయణ, అమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో వాసిరెడ్డి శివ, బడే కృష్ణ, ఆడబాల సత్యనారాయణ, అడబాల రాజేంద్రప్రసాద్, పెద్దిరెడ్డి భాస్కర్ పాల్గొన్నారు.

గజ్జె కట్టిన చిన్నారులు

ఏలేశ్వరం, మార్చి 14: పట్టణానికి చెందిన శ్రీసీతారత్న లలిత కళాసృజనికేతన్ గురువులు ముక్కపాటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన నేర్చుకున్న పిల్లలందరికీ గురువారం రాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పురోహితులు కోమరి మహేష్ 25మంది చిన్నారులకు గజ్జెపూజ నిర్వహించారు.

భవితా కేంద్రం పరిశీలన

ఏలేశ్వరం, మార్చి 14: విద్యార్థులు అన్ని రంగాల్లోను రాణించాలని సహిత విద్య కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరావు అన్నారు. గురువారం ఏలేశ్వరంలో భవితా కేంద్రం లో రికార్డులు, యాక్టివిటీస్ ఆయన పరిశీలించారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి'

ఏలేశ్వరం, మార్చి 14: బీజేపీతోనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం పలు గ్రామాల్లో పర్యటించి బీజేపీ జెండాలను ఎగురవేశారు.

కిడ్నీ దినోత్సవ అవగాహన సదస్సు

గండేపల్లి, మార్చి 14: సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల మెడికల్ అండ్ ఫస్ట్-ఎయిడ్ కమిటీ వారి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా డాక్టర్ సిహెచ్ సరోజిని హాజరయ్యారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, మార్చి 14: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగంలో రెండో ఏడాది విద్యార్థులు ప్రస్నింద్ బిజాబ్, సంజయ్‌దాస్ నేపాల్‌లోని లోగ్రీన్ స్మార్ట్ ఇంటర్నేషనల్ కాలేజీలో నిర్వహించిన టెక్నికల్ పోటీలో బెస్ట్‌వెబ్ డెవలప్‌మెంట్ అవార్డు కైవసం చేసుకుని రూ.6వేల నగదు బహుమతి సొంతం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంశ్రీనివాసరెడ్డి తెలిపారు.

పోలీసు కవాతు

గండేపల్లి, మార్చి 14: ఎస్పీ ఉత్తర్వుల మేరకు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల దృష్ట్యా పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసు సిబ్బందితో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

అన్నవరం, మార్చి 14: అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థి బలుసు సత్య వీరబోస్‌కి గురువారం వెలువడిన సైనిక్‌స్కూల్ ఫలితాల్లో విజయం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

సత్యదేవుడికి సత్యప్రభ పూజలు

అన్నవరం, మార్చి 14: సత్యదేవుడి సన్నిధిలో గురువారం ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ కార్యకర్తలతో కలసి స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పార్టీ అధినేత రెండో విడత టిక్కెట్ల జాబితాలో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఆమె పేరు ప్రకటించడంతో గురువారం ఈ మేరకు స్వామిని దర్శించుకున్నారు.

వినూత్నరీతిలో గణిత దినోత్సవం

గొల్లప్రోలు రూరల్, మార్చి 14: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవం 'పై' డేను వినూత్నరీతిలో గురువారం నిర్వహించారు. 'పై' విలువ అయిన 3.14 ఆకారంలో విద్యార్థులను కూర్చొబెట్టి మానవహారం నిర్మించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గొల్లప్రోలు రూరల్, మార్చి 14: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకూ కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

పిఠాపురం రూరల్‌లో..

పిఠాపురం రూరల్, మార్చి 14: పిఠాపురం మండలం పి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ ఈశ్వర ప్రభాకర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పి.దొంతమూరు, వెల్లురు, జగ్గంపేట రాజుపాలెం, బి.కొత్తూరుల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు సరఫరా ఉండదన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, ఓంభీమ్‌బుష్, లంబసింగి, తంత్ర, మేనమామ

దేవి మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, ఓంభీమ్‌బుష్, గామి, ఎబౌట్‌మై హస్బెండ్, లంబసింగి

తిరుమల	:	భీమా
లక్ష్మి	:	భీమా
సీఐండర్1	:	గామి
సీఐండర్2	:	ప్రేమలు
శ్రీప్రియ	:	గామి
పద్మప్రియ	:	ప్రేమలు
సత్యగౌరి	:	గామి, ప్రేమలు
సూర్య 1	:	గామి
సూర్య 2	:	భీమా

ఎన్నికల ఖర్చుల నమోదు తప్పనిసరి: ఆర్డీవో

పెద్దాపురం, మార్చి 14: అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను నమోదు చేయాలని, పర్యవేక్షణలో లోపం లేకుండా చూడాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ టీం, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ తదితర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. నామినేషన్ దాఖలునుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ వ్యయపరిశీలన బృందాలు, ఖర్చుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు ఏర్పాటు చేసిన నిఘా బృందాలు సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలపైనిఘాటీం వీడియో సర్వేలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి వీడియో పరిశీలన సభ్యుల ద్వారా వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులకు సమన్వయం చేసుకోవాలన్నారు.

176 కిలోల గంజాయి పట్టివేత

ప్రత్తిపాడు, మార్చి 14: ప్రత్తిపాడు సెబ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించి 176కిలోల గంజాయిని పట్టుకున్నారు. సెబ్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో, సూపరింటెండెంట్ రవికుమార్ ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్‌వద్ద సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన తనిఖీలు నిర్వహిస్తుండగా తునినుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న వ్యాన్‌ను సెబ్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 176కిలోల గంజాయిని పట్టుకుని సిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాకు చెందిన వ్యక్తిగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.9లక్షలు ఉంటుందని గంజాయితోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రవికుమార్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐటీ సీఐ ఎల్.చిరంజీవి, ఎస్ఐ ఆశలత, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ వైఖరికి వ్యతిరేకంగా పోరాటం

జగ్గంపేట, మార్చి 14: మద్దతు ధరల గ్యారంటీ చట్టం రూపొందించాలని, రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చ పిలుపులో భాగంగా గురువారం నగరంలో రైతు కూలీ సంఘం గురువారం ధర్నా నిర్వహించింది. ప్రధాని మోదీ నిరంకుశ వైఖరిని రైతులు డిమాండ్లను నెరవేర్చాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య డిమాండ్ చేశారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు

జగ్గంపేట, మార్చి 14: జగ్గంపేట నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణ వర్మ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ గురువారం విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.